

# పట్టాలు తప్పని రైళ్లు

శ్రీమణి

గ్రీష్మం కన్నెర్ర చేసెరిది. ఆ కళ్ళ లోంచి వచ్చిన సెగలు పొంగలై భగ భగమంటూంటే ప్రకృతి భయపడి పోయింది. పచ్చనిచెట్లు ఎండి మోడులై పోయాయి; చెరువులన్నీ ఎండిపోయి బీటలు తీసేయి; బావుల్లో మట్టి బయటపడింది. మార్తాండ ప్రతాపానికి జోహార్లర్పిస్తూ మానవకోటి అంతా ఆపసోపాలు పడుతున్న వేళ శాస్త్రిగారింట్లో మనుష్యులు మాత్రం ఈ ఎండని లెక్కచెయ్యనంత తొందరలో వున్నారు. ఆరోజు వారింటిముందు రెండెడ్ల బండీ, బండిలో ప్రయాణానికి కావలసిన సామానూ, బండిని తోలడానికి సిద్ధంగా వున్న పెద్దపాలేరు వెంకన్నా—ఎద్దుల మెడలోవున్న గంటల్ని చేతితో ఒకసారి కదిలించి యింట్లోవున్న వారిని రమ్మని హెచ్చరించేడు వెంకన్న. లోపల 'అమ్మాయ్ తొందరగా కానివ్వమ్మా! వర్జ్యం వస్తుంది' అంటూ యింటిపెద్ద హెచ్చరించేరు లోపలికి చూస్తూ.

'వెళ్లొస్తానత్తయ్యా!' అత్తగారి పాదాలకు నమస్కారం చేసింది చిన్నకోడలు జానకి కన్నీళ్లతో.

'పిచ్చిపిల్లా! కన్నీళ్లెందుకే? ధైర్యంగా వుండాలి మరి. ఇంకా చిన్నపిల్లవామ్మా!' అంటూ కోడలి కన్నీళ్ళు తుడిచి తన కళ్లొత్తుకుంది పార్వతమ్మ.

'వెళ్లొస్తానక్కా!' పక్కనేవున్న తోటి కోడలికి నమస్కరించింది.

'వెళ్ళిరా చెల్లీ! ఇన్నాళ్లూ కలలుకనీ కనీ ఇప్పుడీ కన్నీళ్లేమిటి జానకీ నువ్వు చాల అదృష్టవంతురాలివి. పండిన ఈ అదృష్టాన్ని కలకాలం నిలుపుకో అమ్మా! అనురాగవతివై అనుకూలంగా మసలుకో!' అని చంటివాణ్ని అందించింది పెద్దకోడలు. మామగారికికూడ నమస్కారంచేసి ముక్కాలిపీట సాయంతో బండెక్కింది జానకి.

పిల్లవాణ్ని జానకికిచ్చి ముందువచ్చి కూర్చున్నారు శాస్త్రిగారు. టాక్సీ తెప్పిస్తానంటే వద్దన్న తండ్రిమీద విసుక్కుంటూ బండి చివరన ఎగిరి కూర్చున్నాడు చిన్నబ్బాయి రఘుపాంటు నలిగిపోతోందన్న బాధతో. బయటికివచ్చిన అత్తగారికీ, తోటికోడలికీ చేతితోనే సంజ్ఞచేసింది కళ్ళూ, గొంతూ నిండిపోయిన జానకి. గంటలు గణగణలాడుతూ ఎద్దులు కదిలే

పలికి 'అమ్మాయిగోరూ! చిన్నమ్మాయి గోరూ!' అంటూ బండికెదురుగా వరుగెత్తు కొచ్చేడు వెంకన్న కొడుకు కిష్టిగాడు చేతిలో తాటాకులో కట్టిన ముంజె లున్నాయి.

'అమ్మాయిగోరికి ముంజె లిట్టవని కొట్టుకొచ్చేనండి, బండీలో తింటార రనండి' అంటూ నసిగేడు భయంగా. 'సరే ఇచ్చిపో!' అన్న శాస్త్రిగారి ఆమోదం పొందగానే తిరిగొచ్చి 'తీసుకోం డమ్మాయి గోరూ!' అని జానకికి ఇవ్వబోయాడు. 'ఛ! వెధవా! బట్టలు పాడైపోతాయిరా!' రఘు మందలించగానే చేయి వెనక్కి తీసు కున్నాడు బిక్కమొహంతో వాడు. 'ఫరవా లేదురా! ఇటియ్యి' అభయహస్తం ఇస్తు న్నట్టు చెయ్యిచాపి తీసుకుంది జానకి ఆ ముంజెల్ని ఎండలో పరుగెత్తుకొచ్చిన శ్రమంతా మర్చిపోయాడు ఆ మాటతో. 'మళ్లా ఎప్పు డొత్తారమ్మాయిగోరూ! తొందరగా వచ్చెయ్యండి' బొంగురుపోయిన కంఠంతో అన్నాడు కిష్టిగాడు. 'అల్లాగే వస్తాలేరా! నేనిచ్చిన పుస్తకాలన్నీ చదు వుతూ వుండు. తెలియకపోతే అక్కనడుగు వెళ్ళు' అంది ఆప్యాయంగా వాడిని చూస్తూ జానకి. బండి కదులుతూంటే రెండుచేతులూ జోడించి వెనక్కి తిరిగేడు భారంగా గేటు కిరుపక్కలా తలలువాల్చి వున్న పూలచెట్లని ఆప్యాయంగా తాకేడు. ఇతరులకి తెలియచెప్పలేని ఆ పూల మొక్కల మూగ వేదనను కిష్టిగాడి మూగమనసు అర్థం చేసుకుంది.

* *

ప్లాట్‌ఫారంమీద కదలడానికి శక్తి లేనట్టు నిండుచూలాలులా నెమ్మదిగా ఎడుస్తూన్న రైలుతోపాటే నడుస్తూ కోడ లికి జాగ్రత్తలు చెపుతూ ప్లాట్‌ఫారం చివరిదాక నడిచి ఆగిపోయారు శాస్త్రి గారూ పాలేరు వెంకన్నా రైలుతో వేగం అందుకోలేక

'ఛ! పాతకాలం మనుష్యులు' కను మరుగైన మనుష్యులని కిటికీలోంచి చూస్తోన్న జానకి వులికిపడి తల లోపలికి తీసుకుని లాపీగా కూర్చుని 'ఎవరూ' అంది

'ఎవరో అయితే నాకేంబాధ? వాళ్లతో పాటు నువ్వూ, నీ వేషమూ', పైనించి పాదాలవరకూ చూసేడు రఘు రుచురుచు లాడుతూ. బిగించివేసిన బారెడు జడ, జడలో గంపెడు కనకాంబరాల చెండూ, మోచేతులవరకూ జాకెట్టూ, ఎర్రటి జరీచీర, చీర కుచ్చెళ్లక్రిందుగా నిండుగా పసుపు రాసుకున్న పాదాలూ

'ఎలా వున్నావో చెప్పనా? వళ్లి వల్లె టూరి మొద్దమ్మాయిలా'......

'కాదు ఉత్త తెలుగు ఆడపడుచులా వున్నాను నాకేం బావా! ప్చ్! పాపం! నీకు నచ్చకపోతే ముందే అత్తయ్యతో చెప్పి నన్ను చేసుకోకుండా తప్పించుకోవలసింది ఏం చేస్తాం మరి...నువ్వు చాలా మారి పోయావు బావా! అయినా నీ ముక్కు మీద కోపం మాత్రం అలాగే వుంది' అసలే ఎరుపెక్కిన రఘు ముక్కు పట్టు కుని వూపింది జానకి

'చాల్లే సరసం! వూరుచేసేని. నీపని చెప్తా! అన్నాడు కోపంగా జానకి నెత్తి మీద ఒక్కటి కొట్టి.

'ఏంచేస్తావేమిటి?' మరింత రెచ్చ గొట్టింది జానకి.

'ఏంచేసినా నిన్ను సమర్ధించడానికి అత్తయ్యానన్ను దండించటానికి మావయ్యా అక్కడలేరులే!' వుడికించేడు రఘు ఆ మాటతో ఎదలోదాగిన బాల్య స్మృతులన్నీ తలపుకొచ్చేయి జానకికి. రఘుకి జానకి మేనమామ కూతరే జానకి గర్భంలో వుండగానే తండ్రి పోయేడు జానకిని ప్రస వించి తల్లి చనిపోయింది చనిపోయే ముందు రఘు తల్లిని పిలిపించి పసి పిల్లనూ వున్న ఆస్తినీ అప్పగించి 'దాన్ని దిక్కుమాలిన దాన్ని చెయ్యవద్దనీ కడు పులో పెట్టుకోమనీ ప్రార్ధించి మాట తీసుకుని మరీ కన్నుమూసింది ఆనెల గుడ్డును తీసుకొచ్చి కంటికి రెప్పలా సాకింది పార్వతమ్మగారు. తన యిద్దరు కొడుకులకంటె కూడ ప్రేమగా చూసే వారు శాస్త్రిగారుకూడ. ఆడపిల్లలు లేని ఆ దంపతులు కలిసివచ్చిన ఆ పిల్లకి జానకి అని పేరు పెట్టుకున్నారు. ఆయింట ఆట పాటలతో అందరి వాత్సల్యాదరణతో మురి పెంగా, ముద్దబంతిపూవులా పెరిగిన ఆ అమాయకురాలిని చిన్నవాడైన రఘుకిచేసి ఆ యింట శాశ్వతస్థానాన్నిచ్చేరు ఆ దంప తులు. జానకి చదివింది ఆ వూరి ప్రాథ మిక పాఠాల చదివే అయినా సెలవులకి యింటికివచ్చిన బావలిద్దరూ పుస్తకాలు తెచ్చి చదివించి మెట్రిక్ ప్యాస్ చేయిం చేరు. మెల్లిగా హిందీ పరీక్షలకి కూడా చదివి విశారదవరకూ పాసయింది. ఆ యింట్లో వ్యక్తుల మనస్తత్వాలనుబట్టీ, వాతావరణాన్నిబట్టీ బావలు తెచ్చిచ్చిన పుస్తకాల విజ్ఞానాన్నిబట్టీ జానకికి చదువు కంటె రెట్టింపు సంస్కారం అబ్బింది. పెళ్ళయిన సంవత్సరానికే జానకి గర్భవతి అయింది. ఆ ఆనందం వారిని ఆకాశాని కెత్తితే-ఏదో ఇంటర్వ్యూకని బెంగళూరు వెళ్లితె రఘు రాసిన ఉత్తరం వారిని నిష్కృంగదీసింది. తను సైన్యంలో చేర డానికి సెలక్టయానని ఈ చిన్న ఉద్యోగా లతో తనకి తృప్తిలేదనీ సైన్యంలో చేరడమంటే చచ్చిపోవడమేనన్న దురభి ప్రాయం మార్చుకోమని చచ్చినా బ్రతికినా దేశంకోసమేనన్న తృప్తీ, పేరూ, ప్రతిభ వుంటుందనీ క్షేమంగా వస్తానని బెంగపెట్టుకోవద్దనీ రాసేడు రఘు పిడుగుపాటులాటి ఆ వుత్తరంచూసి అదిరిపోయారా దంపతులు. ఇంతవరకూ తన జీవితాన్ని సక్రమంగా తీర్చిదిద్దిన విధి ఇప్పుడు వక్రబుద్ధితో చూస్తున్నదేమిటా అని వాపోయింది జానకి. జరగవలసిన వేడు కలూ తీరవలసిన ముచ్చట్లు లేకుండా వెన్నెలరాత్రులూ, మల్లెల సాయంత్రాలూ జానకి వేడి నిట్టూర్పుతో కరిగిపోయిన జ్ఞాపకాల వలయంలో నవమాసాలూ తిరిగి పోయి నో శుభ ముహూర్తాన పండంటి కొడుకుని ప్రసవించింది జానకి. నిండులేని రెండు సంవత్సరాలు గడిచిపోయిన జానకి జీవితంలో మళ్లీ వసంతం చిగురించింది. రఘు రెండు నెలల సెలవుమీద ఆఫీసర్ హోదాలోవచ్చి ఇంటిల్లిపాదికీ దీపావళి పండుగచేసేడు సెలవు అయిపోగానే జానకినీ బాబునీ ప్రయాణంచేసి తీసుకుని పోతు న్నాడు. లోకమాత సీతాదేవిలాకాక తన జీవితంలో నందన వనాలూ వెన్నెల వసంతాలూ ఎదురు చూస్తున్నాయన్న తృప్తితో నిద్రపోతున్న భర్తనీ, బాబునీ చూసుకుని నవ్వుకుంది జానకి.

* * *

'జాన్! వో జాన్! టైమయింది తయా రయావా లేదా?' హడావిడిగావచ్చిన రఘుని

సమ్మంలోనే ఆడ్డుకుంది జానకి.

'ఆ పిలుపేమిటి? లక్షణంగా అత్తయ్య మావయ్య జానకి అని పేరుపెట్టేరు సరదా పడుతున్నావని 'జానీ' అని పిలి పించుకున్నాను. ఇప్పుడా 'ఈ' కారాన్ని కూడ కట్ చేసేవు జాన్ అటజాన్. ఇంగ్లీషు వాళ్ల పేర్లలాగా పేరు పిలవడానిక్కూడ అంత బద్దకం ఏమిటి బావా!' మూతి విరి చింది.

'అయిందా వుపన్యాసం! నాకు బద్ధకమా! అయితే ఈ వుద్యోగం చేసినట్టే. మిలిటరీ డిసిప్లిన్ అంటే ఏమిటను కున్నావో? సరేగాని ఆసలీవేళ పార్టీకి వెళ్లాలని గుర్తుందా? టైము ప్రకారం తప్పనిసరిగా వెళ్లాలిక్కడ. నీ శ్రావణ మాసం పేరంటంకాదు త్వరగాకానీ!'

'ఇదిగో నాదంతా అయిపోయింది బావా! బాబుని ముస్తాబుచేస్తే...'

'బాబుసంగతి ఫ్యాన్ చూసుకుంటాడులే నువ్వుపద...

'అదేమిటి? బాబుని తీసుకు వెళ్లక పోతే ఎలా? వాడు ఏడుస్తాడు బావా!'

'ఫరవాలేదు, ఏడ్చి వాడే వూరుకుంటాడు లే. ఇక్కడి కెవరూ పిల్లలని తీసుకురారు నదు జానీ!' జానకికి అడుగు పడలేదు, ఇంతవరకూ బాబెప్పుడూ తనని విడిచి క్షణం వుండలేదు.

'ఇక్కడ వీడు ఏడుస్తూ వుంటే అక్కడ పార్టీ ఎంజాయ్ చెయ్యగలనా బావా? ఎంత టైము పడుతుందో ఏమో?' అంది జానకి.

'అదంతే జానీ! అలవాటు చేసుకోవాలి, నువ్వు చాలా మారాలి తప్పదు' విసుక్కుంటూ స్కూటర్ స్టార్ట్ చేసేడు. అయిష్టంగానే తప్పనిసరిగా స్కూటర్ వెనక కూర్చుంది వెనక్కిచూస్తూ వెనక నించి బాబు ఏడుపు వినిపిస్తూ వుంటే మనసు విలవిల్లాడింది. ఏం చేస్తుంది? ఆడది.

* * *

నల్లని మేఘాలు ఆకాశమంతా పరుచు కున్నాయి ఏ క్షణంలోనయినా కుంభవృష్టి కురిపించడానికి సిద్ధంగా వుంది ఆకాశం. ఎండలు మండే ఈ వేసవిలో మేఘాలు చేస్తే హడావిడి అసహజంగా అనిపించింది. జానకికి. మనసంతా ఏదో అలజడిగా వుంది.

# పట్టాలు తప్పని రైళ్లు

బావ ఇంకా రాలేదు వర్షం వచ్చేస్తే... స్కూటరు శబ్దం విని బయటికి పరు గెత్తేడు బాబు 'నాన్న' అంటూ. బాబుని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ లోపలికి వచ్చి సోఫాలో కూర్చుని 'ఇదిగో చూడు జానీ! నీకోసం ఏం తెచ్చానో?' అన్నాడు చేతిలో పెద్దపాకెట్‌ని పట్టుకుని.

'ఏమిటో అంత పెద్ద బహుమానం!' అంటూ తాపీగా క్రింద కూచుని భర్త బూట్లు విప్పుతోంది. 'ఇన్సురంటూ హతాశుడైపోయాడు రఘు.'

'ఏం తెచ్చారని ఆత్రుతగా చేతిలో పాకెట్ అందుకుని చూసి మురిసిపోవాలి జానకి' అనుకుంటూ వచ్చేడు రఘు, కాని

## ఓం నమః శివాయ

కం. లలిత సంగీత తెలుసునన్న
లాలించి మన్నించరు వినరు నా
పాటలున్
లింగా నీ వొక్కడివే
లీలాయుత గానమాధురి గ్రహిం
చిన చాలున్.

కం. లుందురు, రసహ్యించుకొందురు
లూహించరు, గుర్తింపరు, గుప్త
గుణాగగణ్యుల్
లృపాలుడు, కృపాలుడు
లౄా, వృధాయాస మనోవిచారకు
లొన్తె.

కం. లెక్కకు నేనొక్కతేనన్న
లేరు, ననుబోలువరులు సాహసికులు
సిద్ధులన్
లైతే నేనందుకు దుఃఖింప
లొక్కరి మెప్పు నాకొద్దు, నీమెప్పు
ముఖ్యం నాకన్న.

కం. లోతుగోతులు నెరుగన్
లౌక్యరీతిననుసరించిఆహ్లాదించెదన్
లంతంత బిరుదులొద్దన్న
లఃహరుడు హసన్ముఖుడై హాయిగా
విందుడయ్యా.

—రచయిత్రి : శ్రీమతి సరస్వతిగిరి

ఛీ! ఛీ! బొత్తిగా మురిపెం తెలియదు మొద్దుకి అనుకుని 'అసలు చూడూ' అంటూ తానే పాకెట్ విప్పి తను తెచ్చిన వన్నీ టేబిలుమీద పెట్టేడు.

'అబ్బ! ఎలా కట్టుకునేది బావా? ఈ బట్టలు నాకలవాటు లేదే!'

అంది వుల్లిపొరల్లా వున్న జపాను సిల్కు చీరల్ని స్లీవ్‌లెస్ బ్లవుజుల్ని చూసి గతుక్కుమంది జానకి.

'అలవాటు చేసుకోవాలి జానీ! నేను ముందే చెప్పాను నువ్వు చాల మారాలని. యింతో అంతో చదువుకున్నదానివయినా వట్టి పల్లెటూరిమనిషిలా మాట్లాడతావేమిటి?' మొహం చిట్లించుకున్నాడు రఘు.

'పొరపాటు బావా! వేషభాషల్లో మన పల్లెటూళ్లోం తీసిపోవు బావా! చదువు సంస్కారాల్లో భేదంవున్నా వేషబాషల్లో పల్లె, పట్నాల భేదం ఏమీలేదు. నాకివన్నీ తెలియక కాదు కాని నామనసుకి నచ్చలేదు అంతే!'

'పోనీ నాకు నచ్చింది. నాకు నచ్చినట్టు నువ్వు ప్రవర్తించడంలో తప్పులేదుగా?'

'అంటే? ఒకవిధంగా భర్త హోదాలో నన్నాజ్ఞాపిస్తున్నావా? ఎంతయినా నువ్వు బయట ఆఫీసర్‌వేగాని నాకు మాత్రం...'

'నీకుమాత్రం ఇదివరకటి బావ నను కుంటున్నావా? కాదు...నువ్వన్నట్టు భర్త హోదాతోనే ఆజ్ఞాపిస్తున్నాను. ఈడ్రస్ వేసుకుని ఈరోజు నాతో సినిమాకిరావాలి' అన్నాడు గట్టిగా. ఈసారి జానకి హతాశ యింది.

'పోనీ! ఆ అలంకరణంతా చేసు కుంటానుగానీ అలాగే బయటికి మాత్రం రమ్మనకు బావా నీకు పుణ్యంవుటుంది' అంది సగం రాజీకొచ్చి

'అహా నీల్లేదు. ఈవేళ నువ్వు బయటికి రావాలి తప్పదు, అందరూ ఆడవాళ్ళని చూస్తున్నావు కదా! వాళ్ళంతా అతి సామాన్యంగా తీసుకునే విషయానికి నువ్వు ఇంత వట్టుదల పడతావెందుకు జానీ!

'పట్టుదలకాదు బావా! ఇక్కడ అందరూ అంటే వారివారి ప్రాంతీయ సాంప్రదాయానికి అనువైన అలంకరణ చేసుకుంటారు. మనం తెలుగువాళ్లం మన సాంప్రదాయాన్ని మనం గౌరవించుకుని నడుచు

కోవాలి, ఒకర్ని అనుకరించటానికి నన్ను బలవంతం చేయడం ఏం న్యాయం బావా?'

'న్యాయమో! అన్యాయమో నాకు తెలియదు జానీ! నాముచ్చటకోసం నిన్నలా వుండమన్నాను. నాకోరిక తీరితే సంతోషిస్తాను లేదా నీయిష్టం' నిష్ఠూరంగా అని మొహం తిప్పుకున్నాడు రఘు. జీవితంలో మొట్టమొదటిసారిగా భయపడింది జానకి భర్త ప్రవర్తనని చూసి. మొన్న వెళ్ళిన పార్టీలోకూడ అంతే టేబిలుమీద పెట్టిన పదార్థాలలో తనకి ఒక్కటీ నచ్చలేదు. తను ఏదీ నోట పెట్టలేకపోయింది, రెండుమూడు రకాల డ్రింక్స్ కూడ పెట్టేరు. తను మర్యాదగానే వాటిని తిరస్కరించింది. తన పద్ధతి రఘుకి చిన్నతనమనిపించిందట. అందరూ తననేచూసి హేళనగ నవ్వినట్టు ఫీలయ్యారుట. యింటికొచ్చి పెద్దవాదన వేసుక్కూచున్నాడా రోజు. అసలే బాబు ఏడుస్తున్నాడన్న చిరాకుపైగా. ఆరోజు మనసంతా పాడయింది.

ఎందుకో తను ఈ సొసైటీలో కలవలేక పోతోంది. పోనీ తన బావకోసం తను ఏదైనా చెయ్యగలదు కాని అందరికోసం నువ్విలా వుండు అలా వుండు అని ఆజ్ఞాపించడం తనకి నచ్చడంలేదు. అందరికోసం తన కిష్టంలేని పనులుచేసి ఆత్మని కించపరుచుకోవాలా?... తామిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుని నడుచుకున్ననాడే కదా మనసులు కలుసుకున్న విందుసంసారం అయ్యేది. పోనీ తనే సరిపెట్టుకుని బావ కనుగుణంగా నడుచుకుంటే...అలా నడుచుకోవాలంటే తనూ భర్తతోపాటు తాగాలి, అర్ధనగ్నంగా బట్టలు వేసుకోవాలి క్లబ్బుల కి వెళ్లి డాన్సు చెయ్యాలి. అందరి చూపులూ తన శరీరాన్ని తూట్లు చేస్తూంటే...అబ్బ! వళ్లు జలదరించింది జానకికి. అలాటి జీవితం రఘుకి చాలా యిష్టం. నలుగురిలోనూ తనకీ అందమైన భార్య వుందని గర్వంగా తలెత్తుకుని తిరగ్గలడు. కాని—కాపీ తనకి? తను పెరిగిన వాతావరణానికీ తను వూహించుకున్న జీవితానికీ ఇది పూర్తిగా విరుద్ధం. దీనికీ దానికీ పోలికే లేదు. తను మారాలంటాడు శారీరకంగా మారిపోవాలి. మనసుని చంపుకున్న బ్రతుకులో సంపూర్ణత ఎలా వుంటుంది?

*

మాణిక్యవీణా ముపలాలయంతీం!
మదాలసాం మంజుల వాగ్విలాసాం!
మహేంద్ర నీలద్యుతికోమలాంగీం!
మాతంగ కన్యాం మనసాస్మరామి!
చతుర్భుజే చంద్ర కళావతంసే!
కుచోన్నతే కుంకుమ రాగసోణే!
పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణాం!
హస్తే నమస్తే జగదేకమాతః!

జానకి కంఠంలోంచి శ్రావ్యంగా వినిపిస్తోంది దేవీ స్తుతి. బద్ధకంగా కళ్లు తెరిచి కప్పుకున్న రగ్గుతీసి పారేసి 'జానీ! టీ' అరిచేడు లేవకుండానే రఘు. జానకి కంఠంలోంచి స్తుతి చటుక్కున ఆగిపోయింది. 'వెయిట్ ఎ మినిట్' అని వినిపించింది. 'పూర్తిగా లేవకుండానే ఏమిటి బావా! నీ టీ కోసం పూజ మధ్యలో లేచి వచ్చేను.' అంది ట్రే టీపాయ్‌మీద పెట్టి.

'హోహో! పూజ చేస్తున్నారా? రేడియోలో భక్తిగీతాలేమో అనుకున్నానులే. అయినా నీకు ముందు ఈ దైవం తర్వాతే దైవపూజలూను. ఆమాత్రం తెలియదూ ఈ సతీమణికి?' టీ కలుపుకుంటూ జానకివంక చూసేడు. పచ్చని పట్టు చీరతో తడిజుట్టు జారుముడి వేసుకుని నయాపైసంత బొట్టుతో వున్న జానకిని చూస్తే తన తల్లి జ్ఞాపకం వచ్చింది రఘుకి. తన తల్లివయసులో చెయ్యవలసిన పూజలు ఈవిడగారి కెందుకో చిరాకెత్తింది రఘుకి. 'అవుననుకో! ఈవేళ శుక్రవారం ఏదో దేవిపూజ చేసుకుందామని' నసిగింది. ఈమధ్య భర్తఅంటే భయపడటం అలవాటయింది జానకికి. కోపంగా చూసేడు జానకిని అత్యాధునికంగా ముస్తాబయి తన వెంట క్లబ్‌కివచ్చే జానకిని వూహించుకున్నాడు క్షణంసేపు. ఎంత అందంగా హుందాగా వుంటుందీ! ఒళ్ళు పులకరించే అందం జానకిది అసలు. ఛ! ఛ! నన్నర్థం చేసుకోదు కదా? నా కనీసపుకోరిక తీర్చని భార్య నాకెందుకు? ఛర్రున కోపంవచ్చింది రఘుకు. 'ఫో! నీపూజలూ నువ్వూ! వంటింట్లోనే ఏదు కూపస్థ మండూకంలా. కుక్కని తీసుకొచ్చి సింహాసనం మీద కూర్చోబెట్టడం నాదే తప్పు' విసురుగా లేచి ట్రేని ఒక్కతోపు తోసేడు టీపాయ్‌వెనక నిలబడివున్న జానకి కాళ్ల మీదపడి ముక్కలయింది టీ సెట్టంతా. 'అమ్మా' అంటూ పాదం పట్టుకుని కూర్చుండిపోయింది జానకి. అప్పటికి కాని తను ప్రవర్తించిన పద్ధతి తెలిసిరాలేదు రఘుకి. 'అరె! దెబ్బ తగిలిందా? చూడనీ' అంటూ తనూ కూర్చుని పాదం ముట్టుకుని చూడబోయాడు రఘు.


35సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
అండ్ ఆసుపత్రి
గౌలిగూడ సిటీ బస్ డిపో ఎదుట,
శ్యామ్ సుందర్ రోడ్, హైదరాబాద్-12 ఆ ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544



న్యూయార్కునకు
ఒక దఫా విమానంలో
వెళ్ళి వచ్చుటకు
మొదటి బహుమతి మరియు
50 అదన బహుమతులు
రు. 25/— విలువగల వస్త్రాలు కొనండి—
యీ ఉచిత కూపన్ పొందండి.
మీ కూపను నెంబరుద్వారా మీరు
26 జనవరి జరుగు డ్రా యందు ఒక
అద్భుతమైన బహుమతి గెలువవచ్చు
రు 25/— ల విలువకు ఒక కూపను కొనండి.
రు. 100/— ల విలువకు నాల్గు కూపనులు
కొనండి. ఎక్కువ కూపనులుంటే అధికమైన
అవకాశాలు
శారీ ఎగ్జిబిషన్
సి. ఐ. ఎస్. బుక్‌షాపునకు పైగా
నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్
లేక
ఫాషెన్స్
బషీర్‌బాగ్, లేడి హైదరీ క్లబ్ ఎదుట
హైదరాబాద్.
AA

'వద్దు! వద్దులే బావా! ముట్టుకోకు. నేను కుక్కని. నన్నిలా విశ్వాసంతోనయినా పడివుండనీ సింహాసనంమీద కూర్చోబెట్ట వద్దులే బావా!' అంది నెత్తురుకారుతున్న పాదాన్ని అదిమి పెట్టి లేవబోతూ.

'ఉండు లేవకు దెబ్బ బాగా తగిలిందా జానీ!' జానకిని లేవనీయకుండా కూర్చో పెట్టేడు.

'లేదులే బావా! దెబ్బచిన్నదే గాభరా పడకు రేపటికి తగ్గిపోతుంధిలే బావా!' విడిపించుకుని లేచి వెళ్లిపోయింది.

స్త్రీకి వ్యక్తిత్వం ఏనాడు నిలబడింది? కనీసం భావస్వాతంత్రం అసలే లేదు. ఆనాడు భర్తే దైవంగా ఎంచి భర్త సేవ లోనే పుణ్యం పురుషార్థం అనుకుని భర్త అడుగుజాడల్లోనే అడుగులువేసి కూపస్థ మండూకాల్లా బ్రతికిన స్త్రీని పతివ్రత అన్నారు ఆనాటి పెద్దలు. ఈనాడు భర్త ఆడమన్నట్టు ఆడి భర్త ఆదర్శాలే తన ఆదర్శాలనుకుని తన వ్యక్తిత్వాన్ని అణిచి పెట్టి భర్త వెంటనే తిరుగుతూ వీలయితే భర్తకి ఆర్థికంగా సహాయంచేస్తూ సంసారం కోసం, భర్త, పిల్లలకోసం తనకితను కరిగిపోతూ వాళ్ళ సరదాలు తనవిగానే భావించి సంసారానికి వెలుగునిస్తున్న నేటి స్త్రీని ఆదర్శగృహిణి అంటున్నారీ నాటి పెద్దలు. స్త్రీయొక్క వ్యక్తిగత స్వతంత్రం మాత్రం రాతియుగంనుంచి రాకెట్ యుగందాక ఒకేవిధంగా వుంది. అడుగుకూడా ముందుకి జరగలేదు. కాకపోతే కాస్త స్వేచ్ఛనిచ్చేరు అదయినా వారి స్వార్థమే. స్త్రీలకి కాస్త స్వేచ్ఛయిచ్చామని గొప్పలుచెపుతు వారు చేసిందేమిటంటే వాళ్ళకి మరింత బాధ్యత, బరువు నెత్తిన రుద్దడమే వాళ్ళుయిచ్చిన సమానహక్కుల ద్వారా వీళ్ళు సాధించిన సమానత ఏమిటంటే పురుషుల బరువు బాధ్యతల్ని సమానంగా పంచుకోవడం. అంతకంటె నేటి వనితల్లు సాధించిన స్వతంత్రం మరేం లేదు ఈనాటి స్త్రీకంటె ఆనాటి స్త్రీలే కాస్త శాంతిగా వున్నారేమో? ఆనాటి తృప్తి శాంతి ఈనాకులేవు నుగవాళ్ళు చెప్పినట్లు ఆ కూపం వదిలి బయటి ప్రపంచంలో అడుగుపెట్టి స్వతంత్రంగా బ్రతుకుతున్న స్త్రీని—ముందు ఆశలు కలిగించిన పురుషలోకమే అభాండాలువేసి కట్టు బాట్లలో పెట్టడానికి ప్రయత్నిస్తుంది. యిక ఆడదానికి విముక్తి అంటూ లేదు కొవ్వొత్తిలా వెలుగునిస్తూ తను కరిగిపోవలసిందే. మొదటినించి ఆభావనే జీర్ణించుకు పోయివుంది ఆడదాని అంతరాంతరాల్లో. భగవాన్! మనసనేదే లేకపోతే ఆత్మగౌరవం ప్రసక్తే లేదుకదా? మనసెందుకున్నట్టు?

చురుక్కుమని చేతిమీద గుచ్చుకున్నట్టయి కళ్ళు తెరిచింది జానకి.. చేతిలో పుల్లముక్కతో ఎదురుగా బాబు డాక్టరో పోజులో నిలబడి వున్నాడు. 'నొప్పయిందిగా అమ్మా! ఇంజక్షను చేసేనుగా. తగ్గిపోతుంది నొప్పి ఏడవకు' అంటూ ఇంజక్షను చేసినచోట చేతితోరాసేడు వాడి చెయ్యి పట్టుకుని అలాగే దగ్గిరికి తీసుకుంది జానకి 'కాలినొప్పి తగ్గిపోతుందిలే నాన్నా! ఏడవను' అంటూ కళ్ళు తుడుచుకుంది 'మనసుకయిన నొప్పి ఎలా తగ్గుతుంది నాన్నా!' అనుకుంది మనసులో. నీరసంగా లేచింది. వంట చెయ్యాలింకా. తన ఆలోచనల్లో టైమెంతయిందో, రఘు ఎప్పుడు వెళ్లేడో గ్రహించనేలేదు. వంట కూడ పనివాళ్లతో చేయించుకో మంటాడు రఘు. తన బావచెప్పినదీ, తను నిరాకరించినదీ యిది మరొకటి. సమానగీతల్లో ప్రయాణం చెయ్యవలసిన బ్రతుకులు అడుగడుక్కీ కుంటుపడుతూంటే గమ్యం చేరుకునే దెప్పటికి? ఎవరికి చెప్పకుంటుంది? ఎవరికి చెప్పకున్నా తననే ఓర్చుకోవా అంటారు. సహించాలంటారు. సహనం—అది ఆనాటినించీ ఈనాటివరకూ చిరంజీవిగా జీవం పోసుకుంది. అది ఆడదానికి భగవంతుడు ప్రసాదించిన శాపమో వరమో తెలియదుకాని అదే భారత స్త్రీకి విలువైన ఆభరణం.

* * *

వారం రోజుల్నించీ భార్యాభర్తల మధ్య మాటల్లేవు. రఘు అవసరాలన్నీ నౌకర్ల ద్వారా జరిపిస్తోంది జానకి. ఎప్పుడూ నవ్వుతూ తిరుగుతూ ఎక్కువగా మాట్లాడే జానకి నిస్తబ్దత రఘుకి విపరీతంగ తోచింది. ఇంటికొస్తే ఈ వాతావరణం భయంగా అనిపించి ఎక్కువగా బయటే కాలం ఖర్చు చేస్తున్నాడు రఘు. ఎన్నోసార్లు మాట్లాడటానికి ప్రయత్నించినా జానకి అవకాశం ఇవ్వడం లేదు తనకి తానై మాట్లాడటానికి అహం అడ్డొచ్చింది. ఇక ఆరోజు తప్పనిసరై తనే మాట్లాడవలసి వచ్చింది, ఆరోజు జరుగుతున్న ఒక ముఖ్యమయిన పార్టీకి తను భార్యతో అటెండవాలి. విధిలేక భయపడుతూనే అడిగేడు జానకిని 'సారీ' బావా! రాలేను' ఘుక్తసరిగా జవాబిచ్చింది జానకి. 'ఈ ఒక్కసారీ రావాలి జానకీ ఇంక నిన్ను రమ్మని అడగను నలుగురిలోనూ నేను చిన్నతన పడాలి' ప్రాధేయపడుతూ అడిగేడు రఘు. 'క్షమించు బావా! ఇప్పుడు రాలేను, కొన్నాళ్ళు నీకూ ఏ వాతావరణానికీ అలవాటుపడనీ, దయచేసి నన్ను బలవంతం చెయ్యకు' అంది. చేసేదిలేక గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు. పార్టీనించి తిరిగి వచ్చేటప్పటికి జానకి బట్టలూ అవీ పెట్టెలో సర్దుతూంది. 'అదేమిటి జానకీ' అన్నాడు రఘు బాధగా. 'ఈరోజు మొదటినించీ



'జానకీ' అని పిలుస్తున్నాడు రఘు. ఆ పిలుపులో తనకి బావ దూరం అయిపోతున్నట్టుగా బాధపడుతోంది జానకి, 'ఏం లేదు బావా ! మావయ్య వుత్తరం రాసేడు చూడు' అని రఘుకి తండ్రిరాసిన

# పట్టాలు తప్పని రైళ్లు

ఉత్తరం తీసుకొచ్చి యిచ్చింది. జానకి కోసం, బాబుకోసం తనతల్లి బెంగపెట్టుకుందనీ, వారంరోజుల్నించీ లేవటంలేదనీ, ఒక్కసారిగా ఇన్నాళ్ళు వదిలివుండటం కష్టం కనుక ఒక్కసారి జానకినీ బాబునీ పంపిస్తే మళ్లీ తొందరగా తిరిగి పంపుతాననీ రాసేడు.

ఉత్తరం చదివి ఇచ్చేస్తూ 'అయితే వెళ్లివస్తావా ?' అన్నాడు పొడిగా రఘు.

'మరి వెళ్లకపోతే అత్తయ్యకి తగ్గుతుందా బావా ? అన్నీ మావయ్య రాసేడు కదా ?'

'సరే అయితే బట్టలు సర్దుకో సాయంత్రం ట్రైనుకే పంపిస్తాను' అని బయటికి వెళ్లిపోయాడు.

జంక్షనువరకూ తనూ ప్రయాణంచేసి అక్కడ ఇంకో రైల్లో బాబునీ జానకినీ కూర్చోపెట్టి తను దిగిపోయాడు. తను మళ్లీ వెనక్కి వెళ్లిపోవడానికి రైలు సిద్ధంగా వుంది. కిటికీదగ్గరికి వచ్చి నిలుచున్నాడు రఘు ఇద్దరికీ నోట మాట రావడం లేదు. 'బాటు చెయ్యిపట్టుకుని 'బాబూ ! మళ్లీ తొందరగా వచ్చేస్తావా ?' అంటుంటే రఘు కళ్ళు చెమ్మగిల్లేయి. నాలుగు కళ్లలోంచి నాలుగు కన్నీటిచుక్కలు బాబు చేతిమీద పడ్డాయి. ఇద్దరూ తలలెత్తి ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. ఇరవై ఏళ్ల నించీ పెరుగుతూవచ్చిన మమతానుబంధం ఇటువంటి చిన్న కలతలతో తెగిపోతుందా? 'జానీ'!' అన్నాడు డగ్గుత్తికతో.

ఆ పిలుపే చాలు కోటివీణలు పలికినంత మధురంగావుంది జానకికి

'బావా !' పరవశించిపోతూ అంది

'మళ్లీ ఎప్పుడొస్తావు జానీ !' అన్నాడు నెమ్మదిగా.

'తొందరగా వచ్చేస్తా బావా !' జానకి కళ్ళు దీపాల వెలుగులో మిలమిలా మెరిసేయి జానకి చేతితో కలిసివున్న బాబు చేతిని ముద్దాడి వదిలేసేడు రఘు. రైలు కదిలింది. 'నేను మళ్లీ వచ్చేటప్పటికి బావ మారతాడు' అనుకుంది ఆ రైల్లో కూచుని జానకి.

'మళ్లీ వచ్చేటప్పటికి జానకి తప్పక తనకనుకూలంగా మారుతుంది' అనుకున్నాడు రఘు ఆ రైల్లో కూచుని. వాళ్ళభావాలతో నిమిత్తంలేకుండా రెండు రైళ్లూ పట్టాలు తప్పకుండా ప్రయాణం చేస్తున్నాయి. ●


SPIC

అద్భుతమైన విజయం సాధించిన మన వీర సైనికులకు జోహారు లర్పించుటకై మేము కూడా మన ప్రజలతో చేతులు కలుపుచున్నాము.

మన కర్షకులు అధిక పంటలు పండించుటకు సహాయపడుటకై మా సేవలను అంకితం చేయుట చేత మన దేశరక్షణ ద్వితీయశ్రేణిని బలపర్చుటకు ప్రమాణం స్వీకరిస్తున్నాము.

దక్షిణ ఇండియా అవసరములను తీర్చుటకై కావలసిన యెఱువులలో సుమారు 25% నకు సరిపోగలిగినంత పరిమాణములను నిర్ణీత కాలములోగా ఉత్పత్తి చేయగలము.

విదేశీయ యాజమాన్యము, లేక సాంకేతిక, లేక యితర సహకారము లేవియు లేకుండా నాన్ టర్న్ కీ పద్ధతిమీద ఆసియాలో మరియు ఐరోపాలో గల యిట్టి గొప్ప ప్రాజెక్టులలో ఒకటిగా రూపొంది తగిన సామగ్రి సేకరించి, నిర్మాణం చేయుటలో పురోగమిస్తున్నాము.

"SPIC GROWS TO SPAN THE NATION"

★

Southern Petrochemical Industries Corporation Limited

MADRAS-14.